




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 1200 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# శతాబ్దాల తెలుగు పత్రికలు తీరుతెన్నులు

–9–

ఈ భాగంలో 1960–70 దశాబ్దం లో ప్రారంభమైన కొన్ని పత్రికల విశేషాలు తెలుసుకుందాం. వీటిలో మొట్ట మొదటిగా మనం మాట్లాడుకోబోయే పత్రిక "ఆంధ్రజ్యోతిదిన పత్రిక".

1960 జూలై 1న విజయవాడ కేంద్రంగా ప్రారంభమైంది "ఆంధ్రజ్యోతి దినపత్రిక." ఈ పత్రిక ప్రారంభం వెనుక వున్న విశేషాలు ఏమిటో క్లుప్తంగా తెలుసుకుందాం. ప్రముఖ పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరావు గారు ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకుడిగా 1958, 59 వరకు పనిచేసి, ఆ సంస్థ నుండి బయటకు వచ్చేసారు. నార్ల వారి ప్రతిభా పాటవాలూ, నిజాయతీ, వర్తమాన రాజకీయాల గురించి ఆయన చేసిన విశ్లేషణలూ వీటన్నిటినీ అభిమానించే రాజకీయ నాయకులు ఆ రోజుల్లో చాలా మంది ఉండేవారు.

ఇదిలా ఉండగా, కృష్ణాజిల్లాలో K.L.N. ప్రసాద్ అనే 32 ఏళ్ళ యువకుడు 1960 లో ఔత్సాహిక వ్యాపారవేత్తగా ఎదుగుతున్నాడు. అప్పటికే ఆయనకు రైస్ మిల్లులు లాంటి వ్యాపారాలు ఉండేవి. ఆనాటి రాజకీయ

నాయకులు గౌతు లచ్చన్న, రంగాగార్ల పెద్దల సలహా మేరకు, ఈ ప్రసాద్ గారు తన వ్యాపారాన్ని విస్తరించే దిశలో దినపత్రికను ప్రారంభిద్దామని అనుకున్నారు. దానికి ప్రధాన కారణం నార్ల వెంకటేశ్వరావు గారు ఆంధ్ర ప్రభ నుండి బయటకు వచ్చేసి, ఖాళీగా ఉండడం కూడా. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఎడిటర్ కోసం ప్రారభింపబడిన పత్రిక "ఆంధ్ర జ్యోతి".

ఆంధ్రా ప్రింటర్స్ ప్రయివేట్ లిమిటెడ్ అనే సంస్థలో K L N ప్రసాద్ తో పాటుగా మరి కొంతమంది భాగస్వాములుగా ఉండేవారు. ఆ సంస్థ నుండి 1960 జూలై 1న ఆంధ్ర జ్యోతి దినపత్రిక మొదటి సంచిక విడుదలయ్యింది. ఆ సంచిక ఆవిష్కరణకు అప్పటి ముఖ్య మంత్రి దామోదరం సంజీవయ్య గారు అధ్యక్షత వహించారు. కేంద్ర సమాచార శాఖా  మంత్రి మొట్టమొదటి ప్రతిని విడుదల చేశారు. 1960 ప్రాంతాల్లో ఆంధ్ర దేశంలో దినపత్రికలను చూసుకుంటే ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, విశాలాంధ్ర, ఇవి మాత్రమే ప్రధాన దినపత్రికలు. వాటి మధ్య నార్లవారి సంపాదకత్వంలో కొత్త పత్రిక అనగానే అన్ని రంగాలకు చెందిన తెలుగువాళ్లు చాలా ఆసక్తికరంగా ఎదురు చూసారు.

అందరి అంచనాలకు మించి ఎదుగుతూ కొద్దీ నెలల్లోనే మిగతా పత్రికలకు గట్టి పోటీ ఇవ్వగలిగారు నార్ల వారు. నాగిరెడ్డి, చక్రపాణిల్లాగా KLN ప్రసాద్ గారు పెట్టుబడి, బిజినెస్ వ్యవహారాలకు పరిమితమైతే, ఎడిటోరియల్ వ్యవహారాలన్నీ నార్ల వెంకటేశ్వరావు గారు చూసుకునేవారు. ఆంధ్రప్రభలో అనుసరించిన పద్ధతులు మళ్ళీ ఆంధ్రజ్యోతిలో పునరావృతం కాకుండా, ఇంకా కొత్తగా పత్రికను ఎలా తీర్చిదిద్దాలి అని నిరంతరం శ్రమిస్తుండేవారు నార్ల. వార్తా పత్రికల్ని గ్రాంధిక భాష నుండి వ్యవహారిక భాష వైపు తాపీ ధర్మారావు గారు మళ్లిస్తే, నార్ల వారు మరొక అడుగు ముందుకు వేసి, వాడుక భాషతో పాటుగా మాండలీకాలు కూడా ప్రవేశపెట్టారు. నార్ల వెంకటేశ్వరావు గారు ఆంధ్ర జ్యోతిలో చేసిన కొన్ని ప్రయోగాల గురించి చెప్పుకోవాలంటే...

రాష్ట్రంలోని వివిధ నగరాలకూ సప్లిమెంటరీలు ప్రచురించి, అక్కడ నుండి వ్యాపార ప్రకటనలు వచ్చేలాగా చూస్తూండేవారు. ఆ సప్లిమెంటరీ లు ఇప్పట్లో పత్రికల్లాగే విడిగా చిన్న చిన్న పత్రికల్లాగా ఉండేవి కాదు.  మాములు పేపర్ లోనే ఒక పేజియో, రెండు పేజీలో, ఒక నగరానికో, జిల్లాకో ప్రత్యేకంగా కేటాయిస్తుండేవారు. ఉదాహరణకు ఆంధ్రజ్యోతి ప్రారంభమైన సంవత్సరానికి అంటే, 1961 ఆగస్టు 2న గుంటూరు స్పెషల్ గా ప్రచురించారు. గుంటూరు నగరం యొక్క ప్రత్యేకతల గురించి. సంపాదకీయంలో నార్ల వెంకటేశ్వరావు గారు చాలా ప్రత్యేకంగా రాశారు. యేమని రాశారంటే...

"ఎంతటి ప్రాచీనమైనది గుంటూరు. అయినా,  ఎంతటి అధునాతన నగరమది.  మధ్య మధ్యలో కొన్ని ఘట్టాలలో కొంత  అరాచకానికి, అల్లకల్లోలానికీ లోనైనా 1823 లో ఒకసారి అగ్ని ప్రమాదానికి లోనై, దాదాపు పూర్తిగా భస్మీ

పతలమైపోయినా, మొత్తంగా నిరంతరాయంగా అది పురోగమిస్తుంది. కాలానుగుణంగా అది పరివర్తనం చెందుతున్నది.“ అలా రాసుకుంటూ వచ్చి--- “గుంటూరును గురించి మనం చెప్పుకోదగినవి. కేవలం పాత గొప్పలే కాదు. స్వతంత్ర భారతంలో కూడా, నవ్యంధ్రలో కూడా అది చరిత్రకు తన సముజ్వల పాత్ర నిర్వహిస్తున్నది. “అని రాస్తూ ఒక ఆసక్తికరమైన సంగతి ఒకటి రాశారు. “తక్కిన రంగాల్లోనైనా గుంటూరు పాత్ర సామాన్యమైనది కాదు గానీ, విద్యారంగానికి సంబంధించినంత వరకూ ఆంధ్రప్రదేశ్ లో దానికదే సాటి. ఈసారి ఆంధ్రప్రదేశ్ లో నెలగొనగల విశ్వవిద్యాలయానికి అదే కేంద్రం కావాలి.” ఇది ఆయన 1961 లో రాసారు.

నాగార్జునాచార్యుడి పేరు పెట్టినా, మరొకరి పేరు పెట్టినా, ఈ కొత్త విశ్వవిద్యాలయానికి తగు కేంద్రం గుంటూరు నగరమే. అప్పుడు ఊహించినట్లుగానే గుంటూరు నగరంలో నాగార్జునా విశ్వవిద్యాలయం ప్రారంభం కావడం అందరికీ తెలిసిన విషయమే. ఇంక ఈ గుంటూరు ప్రత్యేకమైనటువంటి పేపర్లలోనే “తిక్కన కాలం నుంచి ఇక్కాలం వరకు--- సహస్రాబ్ది వరకు విస్తరించిన గుంటూరు చరిత్ర” అంటూ విష్ణు బొట్ల సూర్యనారాయణ గారు గుంటూరు గురించి చాలా వివరంమైనటువంటి విశేషాలు అందించారు.

అలాగే తరవాత పేజీలో “ఒకనాటి కారాగారం నేటి కళాశాల “ అని గుంటూరు మెడికల్ కాలేజీకి వున్న చరిత్రను చాలా ఆసక్తికరంగా రాసారు. గుంటూరు మెడికల్ కాలేజీ స్థలంలో ఒకనాడు సబ్–జైలు ఉండేదట. అలాగే సబ్–జైలు మూసేసాక, మెడికల్ కాలేజీ వచ్చింది. మళ్ళా ఈ సబ్–జైలుకీ, మెడికల్ కాలేజీకి మధ్యలో ఎన్నో సంస్థలు ఆ ప్రదేశంలో వచ్చాయట. 19 వ శతాబ్దంలో ఈ సబ్–జైలు ఈ ప్రదేశం నుండి మాయం కావడంతో ఆ జైలు భవనమే తాత్కాలికంగా కలెక్టర్ ఆఫీసు కావడం 1904 లో జరిగింది. 1911 లో కలెక్టర్ ఆఫీసుకు కోసం కొత్త భవనం తయారు కావడం తో ఈ భవనం ఏమో సాల్వెన్సీ ఆఫీసుకు వెళ్ళింది. అలా రకరకాల చేతులు మారి, గుంటూరు మెడికల్ కాలేజీ వచ్చిందని చాలా ఆసక్తికరమైన సమాచారాన్ని ఆ గుంటూరు నగర ప్రత్యేక పేజీలో రాశారు.

ఇంకా ఈ ఆంధ్రజ్యోతి దినపత్రికలో నార్లవారు చేసిన ప్రయోగాలు – వ్యవసాయదారులకోసం, మహిళల కోసం, అలాగే ఏదైనా ప్రత్యేక సందర్భం వచ్చినపుడు ప్రత్యేకంగా నిపుణులతో వ్యాసాలు రాయించారు. ఆయన ఒక్క రోజు కూడా మానకుండా, వరసగా సంపాదకీయాలు రాస్తూండేవారు. ఇంకో విశేషం – మంచి పుస్తకాలు ఏవైనా మార్కెట్ లోకి వస్తే, వాటిని కూడా సంపాదకీయంలో పరిచయం చేస్తుండేవారు. వార్తలకు శీర్షికలు పెట్టడంలో కూడా చాలా కొత్తదనం చూపించారు. ఇవన్నీ నార్లవారు చేసిన ప్రయోగాలు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక మొదలైన 10 సంవత్సరాలకు K. L. N. ప్రసాద్ గారు రాజ్యసభ సభ్యుడు అయ్యారు. మరి సహజంగానే ఆయన కాంగ్రస్ పార్టీ సభ్యుడు కావడం వల్ల ఆంధ్రజ్యోతి దినపత్రిక కాంగ్రెస్ పార్టీ విధానాలను

సమర్ధించక తప్పలేదు. అయితే, నార్ల వెంకటేశ్వరావు గారు తన స్వతంత్ర ప్రవృత్తికి ఏమాత్రం ఆటంకం కలిగించినా సహించేవారు కాదు. ఆయనెప్పుడూ రాజీనామా పత్రం జేబులో పెట్టుకొని తిరుగుతారని గతంలో చెప్పుకున్నాం. ఎమర్జెన్సీని ప్రకటించిన సమయంలో ఆయనే ఆంధ్రజ్యోతి సంపాదకుడిగా వున్నారు. ఎమర్జెన్సీ ప్రకటించిన రోజున ఇలా రాసారు.

" జాతీయ అత్యయిక పరిస్థితి ప్రకటన." దేశంలో కల్లోల వాతావరణం దృష్ట్యా రాష్ట్రపతి ఉత్తర్వు. "అది బాగానే వుంది. కానీ, దాని పక్కనే ఏం రాసారంటే.... ఎమర్జెన్సీకి మద్దతు ఇస్తారా అన్నట్లుగా " రాష్ట్రపతి ఉత్తర్వు పై రాష్ట్ర మంత్రి వర్గం హర్షం" ప్రజలు ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి. ముఖ్య మంత్రి శ్రీ వెంగళరావు విడిగా మరొక ప్రకటన చేస్తూ... అని మరొక వార్త కూడా రాసారు. "ఎమర్జెన్సీ రోజుల్లోనే సంజయ్ గాంధీ, గుంటూరు సందర్శించిన సందర్భంలో "ప్రత్యేక ఎడిషన్ వెయ్యాలని" యాజమాన్యం కోరారట, నార్ల వెంకటేశ్వరావు గారిని. దానికి ఆయన అంగీకరించలేదు. అయినా కానీ, నార్ల వారిని కాదని, యాజమాన్యం స్పెషల్ ఎడిషన్ విడుదల చేసింది. అలాంటి విబేధాల కారణంగా నార్ల వారు తాను విత్తనంవేసి, పాదు చేసి, పెంచి పోషించిన ఆంధ్రజ్యోతి దినపత్రిక నుంచి 1977 లో బయటకు వెళ్లిపోయారు. నార్ల వెంకటేశ్వరావు గారి తర్వాత ఆంధ్రజ్యోతి సంపాదక భాధ్యతలు స్వీకరించింది నండూరి రామ్మోహన్ రావుగారు.

నండూరి రామ్మోహన్ గారికి, నార్ల వారితో అంతకు ముందే దశాబ్దాలనుండి అనుబంధం వుంది. నార్ల వారు ఆంధ్ర ప్రభలో సంపాదకుడిగా వున్నప్పుడు అక్కడ సహాయ సంపాదకుడుగా ఉండడమే కాకుండా, నార్ల వారు ప్రభకు రాజీనామా చేసినపుడు ఒకటి, రెండేళ్లు ఆ ఆంధ్రప్రభకు ఇన్ ఛార్జి ఎడిటర్ గా వున్నారు నండూరి రామ్ మోహనరావు గారు. మళ్ళా నార్ల వెంకటేశ్వరావుగారు ఆంధ్రజ్యోతిని ప్రారంభించినపుడు, ఆయన దగ్గర ఉప సంపాదకుడుగా చేరారు నండూరి. అన్ని పరిచయాలు ఉండడం, ఉపసంపాదకుడిగా ఉండడం వలన, 1977 నవంబర్ 17 వతేదీన మొట్ట మొదటి పేజీలో సంపాదకుడు నండూరి రామ్ మోహన్ రావు అని ప్రకటించారు. ఆ తరువాత రెండు రోజులకే 1977 నవంబర్ 19 వ తేదీన దివి తాలూకాలో పెద్ద తుఫాను వచ్చింది. ఆ ఉపద్రవాన్ని కూడా అత్యంత సాహసోపేతంగా కవర్ చేశారు ఆంధ్రజ్యోతిలో. ఆ తుఫాను తరవాత వచ్చిన రోజుల్లో కొన్ని పేపర్లు మీరు యు– ట్యూబ్ లో చూడవచ్చు. 1977 నవంబర్ 22 వ తేది జ్యోతి పేపర్ లో ఇలా రాసారు.

" గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలో ప్రకుతి విలయతాండవం. పెనుతుఫానులో వేలాది మంది ఆహుతి, లక్షలాది మంది ప్రజలకు నిరాశ్రయం. వందలాది ఎకరాల పంట నష్టం. "

ఆ మరుచటి రోజు నవంబర్ 23న "గుంటూరు జిల్లాలో రెండు వేల మంది మృతి. తుఫాను బాధితులకు హెలికాప్టర్ల ద్వారా ఆహార పదార్థాల సరఫరా. " అని రాసారు. కేవలం వార్తలే కాకుండా ఆ తుఫానుకు

సంబంధించిన వంటి ఫోటోలు అందించడంలో కూడా ఆంధ్రజ్యోతి ముందు వున్నది. 1977 నవంబర్ 24 న మొట్ట మొదటి పేజీలోని ఫోటోలు వేస్తూ... "ఎటు చూసినా అభాగ్యులే. కధా వసిష్టులే, బాధా సర్పదస్టులే."అనే శీర్షిక తోఆ ఫోటోలు అవీ వేశారు. "తుఫాను నష్టాల పరిశీలనకు విమానంలో రాష్ట్రపతి సంజీవరెడ్డి పర్యటన." అని ఆ వివరాలన్నీ కూడా ఇచ్చారు.

ఇంక, నండూరి రామ్ మోహనరావుగారు సంపాదకుడిగా ఉండగానే ఆ సంస్థ నుంచి జ్యోతిచిత్ర, వనితా జ్యోతి, బాలజ్యోతి పత్రికలు ప్రారంభం అయ్యాయి. నండూరి రామ్ మోహనరావు గారు ఆంధ్రజ్యోతి సంపాదకుడుగా వున్నా దశాబ్దాలలోనే పోటీగా ఈనాడూ, ఉదయం పత్రికలు ప్రారంభం కావడం. అలాగే ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగుదేశం అధికారం లోకి రావడం, స్థాపకుడు K. L. N. ప్రసాద్ గారు మరణించడం ఇలాంటి వన్నీ సంభవించాయి. 1993లో నండూరి రామ్మోహనరావు గారు ఆంధ్రజ్యోతి నుండి పదవీ విరమణ చేశారు. దాని తర్వాత ఐ. వెంకటరావుగారు ఆంధ్ర జ్యోతి దినపత్రికకు సంపాదక భాధ్యతలు స్వీకరించారు. అప్పటినుండి 2000 డిసెంబర్ 31 వరకూ ఆంధ్రజ్యోతి దినపత్రిక కొనసాగింది. అప్పటికే మార్కెట్లో ఈనాడు ప్రభంజనం కొనసాగుతుండడం, వార్త లాంటి దినపత్రికలు రావడం, బహుశా పోటీలో నిలవలేకో, మరే ఇతర వ్యాపార కారణాల వల్లనో కానీ, 2001 జనవరి 1 నుంచి ఆంధ్ర జ్యోతి దినపత్రిక వెలువడలేదు. దీన్ని ఆంధ్రజ్యోతి దిన పత్రిక మొదటి దశ అనుకోవచ్చు. అంటే 1960 నుంచి 2000 వరకు. ఇప్పుడు మనం చూస్తున్న ఆంధ్రజ్యోతి దినపత్రిక చరిత్రలో రెండోదశ అన్నమాట. అదెలా జరిగిందంటే, 1990 ప్రాంతాల్లో వేమూరి రాధాకృష్ణ గారు ఆంధ్ర జ్యోతి దినపత్రికలో రిపోర్టరుగా పనిచేస్తుండేవారు. 2001లో మూతపడిన ఆంధ్రజ్యోతి దినపత్రికను ఆయన కొనుగోలు చేసి, 2002 అక్టోబర్ 22 నుంచి ఆయన పునః ప్రారంభించారు. ఈ రెండవసారి ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిటర్ గా కె. రామచంద్ర మూర్తిగారు బాధ్యతలు స్వీకరించారు.

ఆంధ్రజ్యోతి సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించేటప్పటికీ ఆయనకు రెండు దశాబ్దాల పైగా వివిధ వార్తా పత్రికల్లో సంపాదకుడిగా పనిచేసిన విలువైన అనుభవం వుంది. మళ్ళీ పారంభమైన ఆంధ్రజ్యోతి దినపత్రికను ఆయన మిగతా పత్రికల పోటీని తట్టుకొని, నిలబడేలాగా చేయగలిగారు. రామచంద్ర మూర్తిగారు 2008 లో రాజీనామా చేశాక, అప్పటి నుండి కె. శ్రీనివాస్ గారు ఎడిటర్ గా కొనసాగుతున్నారు. ఇవండీ 1960 జూలై 1నుంచి ఈ 60 సంవత్సరాల ఆంధ్రజ్యోతి దినపత్రిక సుదీర్ఘ ప్రయాణంలో కొన్ని విశేషాలు. క్లుప్తంగా మాత్రమే చెప్పగలిగాను. ఎందుకంటే , 60 ఏళ్ళ చరిత్ర అంటే, బోలెడన్ని విశేషాలు ఉంటాయి. కొన్ని మాత్రమే తెలియజేయగలిగాను.

తరవాత ఎలానూ మనం 1960 టైం లైన్ లో వున్నాం కాబట్టి, ఆంధ్రజ్యోతి దినపత్రిక గురించి మాట్లాడుకున్నాం కాబట్టి, అదే దశాబ్దంలో ప్రారంభమైన ఆంధ్రజ్యోతి వార పత్రిక విశేషాలు కూడా ఇప్పుడే తెలుసుకుందాం. ప్రముఖ

దినపత్రికలన్నిటికీ అనుబంధంగా వార పత్రికలు ఉండడం అనేది ఆ రోజుల్లో ఒక ఆనవాయితీ అనుకుంటాను. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ దినపత్రికలు అనుబంధంగా దశాబ్దాల పాటు అవే పేర్లతో కొనసాగిన ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక, ఆంధ్రప్రభ  సచిత్ర వారపత్రిక ల గురించి మనం గత భాగాల్లో మాట్లాడుకున్నాం. ఆ పత్రికల త్రోవలోనే ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రారంభమైన 7 సంవత్సరాలకు అంటే, 1967 ఉగాదికి తన తొలి వారపత్రికను తీసుకువచ్చింది. అలా 1977 వరకూ ఎడిటర్ గా నార్ల వెంకటేశ్వరావు గారి పేరే వార పత్రికకు కూడా ఉండేది.

మొట్టమొదటి సంచిక 1967 ఉగాదితో ప్రారంభమైంది. అందులో ఏయే అంశాలు ఉన్నాయో చూద్దాం. ఈ సంచిక ముఖ చిత్రం నాకు లభ్యం కాలేదు. ఈ సంచికను ప్రారంభిస్తున్నందుకు శుభాకంక్షాలు తెలియజేస్తూ ప్రకటన కర్తలు ఇచ్చిన వ్యాపార ప్రకటనలు పత్రికనిండా వున్నాయి. “నవయుగాల బాట– నార్ల మాట”. అనే మకుటంతో నార్ల వెంకటేశ్వరావు గారు వ్రాసిన పద్యాలు అంతకుముందు దినపత్రికలో వస్తూ ఉండేవి. వాటి కొనసాగింపే, ఈ వారపత్రిక మొదటి సంచికలో కూడా వున్నాయి. ముప్పాళ్ల రంగనాయకమ్మగారి “కళ ఎందుకు? సీరియల్. దివ్వేదుల విశాలాక్షి “గ్రహణం విడిచింది” నవల. బుచ్చిబాబు గారి “నా అంతరంగ కథనం”ఆత్మకథ ధారావాహిక. ఇలాంటివన్నీ చూస్తుంటేనే, యెంత ఉన్నతమైన అభిరుచితో ఈ వారపత్రికను మొదలుపెట్టారో తెలుస్తుంది. సినీనటుడు అక్కినేని నాగేశ్వరావుగారు కూడా ఆంధ్రా ప్రింటర్స్ లో భాగస్వాములుగా ఉండేవారని ఆ రోజుల్లో చెప్పుకునేవారు. ఆయన ఆత్మకథ “నేనూ–నా జీవితం”అనేది ఆంధ్రజ్యోతి ప్రారంభించిన కొద్ది నెలలకు సీరియల్ గా రావడం మొదలయ్యింది ఈ వార పత్రికలో.

అప్పటికే మార్కెట్ లో వున్న ఆంధ్రపత్రికా, ఆంధ్రప్రభా ఒక సంప్రదాయబద్ధమైన శైలిలో నడుస్తుండగా, మొట్టమొదటి నుండే నవ్య రీతుల్లో, కొత్త పుంతలు తొక్కుతూ కొనసాగింది ఈ ఆంధ్రజ్యోతి వారపత్రిక. 1968లో గొలుసు నవల అనే ప్రక్రియకు శ్రీకారం చుట్టి, పురాణం సుబ్రహ్మణ్య శర్మగారూ, గొల్లపూడి మారుతీరావు గారూ, కొమ్మూరి వేణుగోపాలరావు గారలు ఒకరు రాసిన భాగాన్ని, మరొకరు కొనసాగించేలాగా గొలుసు కథను వరస సంచికల్లో ప్రచురించారు.

1975 ఉగాది నుంచి నవలా ప్రియదర్శిని అనే విన్నూతనటు వంటి స్కీములో 5 వారాలు మాత్రమే నడిచే చిన్న నవలల పోటీ నిర్వహించారు ఈ వారపత్రికలో. సంవత్సరానికి 12 నవలలు ఎంపిక చేసి, ప్రకటించి, వాటిని ప్రచురించాక పాఠకుల అభిప్రాయాలను బట్టి మళ్ళీ వాటిలో నుంచి 4 నవలలకు బహుమతులు ఇవ్వడం. ఇలాంటి పోటీ ఇంత వరకూ తెలుగులో ఎప్పుడూ రాలేదు. ఈ స్కీములో మొట్ట మొదటి విడతగా ఎంపిక చేసిన నవలల్లో మల్లాది వెంకటకృష్ణ మూర్తి గారి రేపటి కొడుకు కూడా వుంది. తరవాత అదే వరసలో దర్శకుడు వంశీ గారి మంచుపల్లకి కూడా వుంది.

నార్ల వెంకటేశ్వరావు గారు ఆంధ్రజ్యోతి నుండి తప్పుకున్నాక 1977 డిసెంబర్ నుంచి అధికార సంపాదకుడిగా పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారి పేరు వచ్చింది. 1990 ప్రాంతాల వరకు పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారే సంపాదకుడు. 1990 ప్రాంతాల్లో తోటకూర రఘు గారూ, ఆయన తర్వాత త్రిపురనేని శ్రీనివాస్ గారూ, ఆ తరవాత దాట్ల నారాయణమూర్తి గారూ, చివరలో అంటే 1999– 2000 సంవత్సరాల్లో చీఫ్ ఎడిటర్ గా పబ్లిషర్ పేరుతోనే 2000 డిసెంబర్ చివరి వరకు ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆగిపోయే దాకా ఆంధ్రజ్యోతి వారపత్రిక కూడా కొనసాగింది. ఆ తరవాత వచ్చిన నవ్య గురించి తరవాత మాట్లాడుకుందాం.

1967 నుంచి 2000 వరకూ అంటే ఆ 33 సంవత్సరాల ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రికను గమనిస్తే, అనేక ప్రయోగాలు కనిపిస్తాయి. ఆంధ్రపత్రిక, ఆంధ్ర ప్రభల్లో లేని అనేక శీర్షికలు ఇందులో కనిపిస్తాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఉత్తమ నవీ, అత్యంత ప్రజాదరణ పొందినవీ గానూ పేరు తెచ్చుకున్న అనేక నవలలు ఇందులో సీరియల్ గా వచ్చాయి. ఉదాహరణకు 1970 ప్రాంతాల్లోనే మొక్కపాటి నరసింహ శాస్త్రిగారి బారిస్టర్ పార్వతీశం రెండవభాగం, యద్దనపూడి సులోచనారాణిగారి “జీవన తరంగాలు”, బీనాదేవి గారి “హేంగ్ మీ క్విక్” నవల, అలాగే 1977లో యద్దనపూడి సులోచనారాణిగారి “పార్థు”,అదే సం వత్సరంలో రావిశాస్త్రి గారి “రత్తాలు–రాంబాబు”, ఎన్.ఆర్. నందిగారి “సినీ జనారణ్యం”, 1982 లో వడ్డెర చండీదాస్ గారి అనుక్షణికం, అదే ఏడాదిలో ఉప్పల లక్ష్మణరావు గారి “బతుకు పుస్తకం”, రంగనాయకమ్మ గారి జానకి విముక్తి, యండమూరి వీరేంద్ర నాథ్ గారి “స్టువర్ట్ పురం పోలీస్ స్టేషన్” ఇలాంటి సీరియల్స్ అన్నిటికీ ఆంధ్రజ్యోతి వార పత్రిక వేదిక అయ్యింది. మల్లాది వెంకట కృష్ణ మూర్తిగారి హాస్య నవల “రెండురెళ్ళు ఆరు” ప్రారంభం అయిన వ్యాపార ప్రకటనల్లో ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణ మూర్తి సీరియల్ అతి త్వరలో ప్రారంభం అని వేశారు. ఆ తరవాత ఆంధ్రుల ఆహ్లాద రచయిత అనేది అందరూ వాడడం.. తర్వాత కాలంలో మల్లాది గారికి అది ఒక బిరుదు లాగా మారిపోయింది.

ఆంధ్రజ్యోతి ప్రారంభించిన మరొక ప్రయోగం ఏమిటంటే నవలలు మాత్రమే కాకుండా, ఒకే రచయిత రాసిన కథల్ని కూడా సీరియల్ గా ప్రచురించారు. అంటే, ఒక్కో వారం , ఒక్కో కథ. ఒకే రచయత రాసినవి. అలా వచ్చినవే శంకరమంచి వారి అమరావతి కథలు, నామిని సుబ్రమణ్య నాయుడి గారి “పచ్చనాకు సాక్షిగా... “, ఖదీర్ బాబు గారి “దర్గా మిట్టా కథలు” ఇలాంటివి. నండూరి రామ్ మోహనరావు గారి నరావతారం, విశ్వరూపం, ... ఇలాంటివన్నీ కూడా ఆంధ్రజ్యోతి వీక్లి లోనే సీరియల్ గా వచ్చాయి. ఆంధ్రజ్యోతి వారపత్రికలో వచ్చిన శీర్షికలు కూడా పాఠకుల్ని విపరీతంగా ఆకర్షిస్తూ ఉండేవి. తంబు గారు రాసిన “స్వగతంబు” , m.v. l. గారి “యువ జ్యోతి”, సమరం గారి “దాంపత్య దీపం”, అలాగే తుర్లపాటి కుటుంబరావుగారి రాజకీయ వ్యాసాలు, గుంటూరు

శేషేంద్ర శర్మ గారి "ప్రశ్నలూ–జవాబులూ" కొత్త కలాలు శీర్షికలో "మినీ కవితలు". ఇవన్నీ కూడా పాఠకులకు లైట్ రీడింగ్ కు బాగా ఉపయోగపడుతూ ఉండేవి.

అలాగే చలంగారు అరుణా చలంలో వున్నప్పుడు రాసిన "బుజ్జిగాడు"అని గోరింకను గురించిన ఒక సీరియల్ లాంటిది. అది కూడా ఇందులోనే వచ్చింది. ఆంధ్రజ్యోతి వార పత్రిక ప్రస్థానంలో, ముఖ్యంగా ప్రస్తావించుకోవాల్సిన మరొక అంశం. దీపావళి ప్రత్యేక సంచిక. 1974 దీపావళికి ఆంధ్ర జ్యోతి వీక్లి వాళ్ళు మొట్ట మొదటిసారిగా దీపావళి ప్రత్యేక సంచికను ప్రచురించారు. 224 పేజీలతో 3 రూపాయల వెలతో ప్రత్యేక సంచిక అనడానికి అన్ని విధాలా అర్థమైన సంచిక అన్నట్లుగా ఈ మొట్ట మొదటి ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికను నార్ల వారు సంపాదకుడిగా ఉండగా విడుదల చేశారు.

ఆ మొదటి పత్రిక సంపాదకీయంలో ఇలా రాసారు.

"సమర్పణ "

ఇది మీ ఆనందం కోసం. విశేష వ్యయ ప్రయాసల కోర్చి, మేము తొలి ప్రయత్నంగా రూపొందించిన ఆనంద దీపావళి ప్రత్యేక సంచిక. ఈ సంచికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో మాతో సహకరించిన రచయితలూ, రచయిత్రులూ ప్రకటన కర్తలూ..." ఇలా రాశారు. ఆ తరువాత ప్రతి దీపావళికి కూడా కథల పోటీ అనేది ఆనవాయితీగా కొనసాగింది. ఈ వార పత్రిక చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఈ కథల పోటీలో ఫలితాలు ప్రకటిస్తూ... ఈ ప్రత్యేక సంచికలో ఏం రాశారంటే...

"ఈ సంవత్సరం మేము నిర్వహించిన ఆనంద దీపావళి కథల పోటీకు 955 కథలు వచ్చాయి. చాలా మంది రచయితలు "మార్ఫిడిటి "ని ఆరాధిస్తూ, భీభత్స ప్రధానమైన ఇతి వృత్తాలను స్వీకరిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. కమ్మని పాట లాగా, మెత్తగా వుండే కథలకు కాలం చెల్లిందా? లేక రచయితలు ఆ పద్ధతికి స్వస్తి చెప్పారా?అని భావించవలసి వచ్చింది.. ఈ కథల ఎన్నికలో మాతో సహకరించిన ఆదివిష్ణు, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, గార్లకు మా కృతజ్ఞతలు. పోటీలో పాల్గొన్న రచయితలకూ, రచయిత్రులకూ మా ధన్యవాదములు. సాధారణ ప్రచురణకు స్వీకరించిన తరవాత సంచికలో ప్రచురిస్తాము" అని మొదటి బహుమతులు వచ్చిన కథల రచయితల పేర్లు ప్రకటించారు.

మొదటి బహుమతి 500 రూపాయలు గణపతి అచ్యుత రామరాజు, విశాఖపట్నం

రెండవ బహుమతి 300 రూపాయలు శ్రీకారం రామ్ మోహన్, హైదరాబాద్

మూడవ బహుమతి 200 రూపాయలు తులసీ కృష్ణ, కడప.

నాలుగు కన్సులేషన్ బహుమతులు పాలకోడేటి సత్యనారాయణరావు, గోవింద నరసింహారావు, యామిజాల శంకరం, ఎం. ఐ. కిషన్.

ప్రత్యేక సంచికలో బాపుగారి పూర్తి పేజీ వర్ణ చిత్రాలూ, అలాగే బాలిగారి ముఖ చిత్రాలూ ప్రత్యేక ఆకర్షణలుగా ఉంటూ ఉండేవి. అలాగే ప్రతి సంచికలోనూ 50, 60 కథలూ, 4,5 పెద్ద కథలూ, బోలెడన్ని కవితలూ, కార్టూన్స్ , సినిమా కబుర్లూ మొత్తమ్మీద ఈ సంచిక చదవక పోతే, దీపావళి పండగ పూర్తికాదు అన్నట్లుగా ముస్తాబై వచ్చేది ఈ దీపావళి సంచిక.

ఆ రోజుల్లో దీపావళి అంటే, ఆంధ్రజ్యోతి దీపావళి సంచికలో పాటుగా, "యువ" మాసపత్రిక ప్రత్యేక సంచికా, జ్యోతి మాసపత్రిక ప్రత్యేక సంచికా కూడా వస్తుండేవి. ఈ మూడింటిలోనూ చూసుకుంటే, మొట్టమొదటి దీపావళి ప్రత్యేక సంచిక "యువ", తరవాత ప్రత్యేక సంచిక జ్యోతి మాసపత్రికా, ఆ తరువాత ఆంధ్రజ్యోతి వార పత్రిక అలా ఆనవాయితీగా కొనసాగుతూ ఒక దశాబ్దం పాటు మూడు పత్రికలు కూడా దీపావళి ప్రత్యేక సంచికలు వెలువరిస్తూ ఉండేవి. నిజమైన సాహితీ ప్రియులకూ, తెలుగు పాఠకులకూ ఈ మూడు ప్రత్యేక సంచికల విందుభోజనం లాగా ఉండేవి.

ఇంకా ఆ రోజుల్లో T. V , ఇంటర్ నెట్టూ ఇంకా మౌలికమైన జీవన సంబంధాలను కబళించని రోజులు. అందుకే పత్రికలన్నా, సాహిత్యం అన్నా అక్షరాస్యులకు అమితమైన అభిమానం ఉండేది. చిట్టచివరి వరకూ అంటే ఆంధ్రజ్యోతి వారపత్రిక ఆగిపోయే చివరి సంచిక వరకూ కూడా దీపావళి ప్రత్యేక సంచికను ప్రచురించే ఆనవాయితీని మరచిపోలేదు. ఇవండీ ఆంధ్ర జ్యోతి వార పత్రిక విశేషాలు.

ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎలాగైతే రెండో దశ వున్నదో, అలాగే ఆంధ్ర తి వార పత్రిక విషయంలో కూడా 2004 నుంచి రెండో దశ మొదలయ్యింది. ఈసారి పత్రిక పేరు "నవ్య"అని పెట్టారు. మొట్టమొదటి సంచిక 2004 మార్చి 21 ఉగాది సంచికగా విడుదలయ్యింది. సంపాదకుడు శ్రీ రమణ గారు. మొట్టమొదట సంచిక సంపాదకీయంలో ఇలా రాశారు "నవ్య పాఠకులకు ఉగాది శుభాకంక్షాలు. నూతన సంవత్సరంతో పాటు మీ ముందుకు వచ్చింది "నవ్య వీక్లి". ఆంధ్ర జ్యోతితో తెలుగు పాఠకులకు వున్న అక్షర అనుబంధం కొన్ని తరాలుగా కొనసాగుతున్నది. నెలకు ఒక ఎడిషన్ గా విస్తరిస్తున్న ఆంధ్రజ్యోతి దినపత్రిక నుంచి ప్రతి బుధవారం "నవ్య" వెలువడబోతోంది. తెలుగు కాల్పనిక సాహిత్య రంగాన అలనాటి నుంచి ఆంధ్రజ్యోతిది సింహ భాగమే. ఆంధ్రజ్యోతి ప్రచురణగా నవ్య పేరుకు తగినట్లే నిత్యా నూతనంగా వెలువడుతూ, మీ అందరికి చేరువై , మీ నిత్యా కృత్యంలో ఒక అంశమై ఇంటింటి పేరై స్థిరపడుతుందని మా ఆశ, ఆకాంక్ష. "

అని మొట్ట మొదటి సంచిక నవ్యలో సంపాదకుడు శ్రీ రమణగారు రాశారు. శ్రీరమణ గారు 2008 డిసెంబర్ వరకు నవ్య వారపత్రికకు సంపాదకులుగా వున్నారు. మారుతున్నటు పాఠకుల అభిరుచికి తగినట్లుగానే శీర్షికలూ, సమకాలీన రచయితల సీరియల్స్ వస్తుండేవి. వి. బాబురావుగారూ, వినాయకరావు గారూ వారిద్దరూ రాసిన పాత సినిమా విశేషాలూ, పాత సినీతారల జీవితాలూ ప్రత్యేక ఆకర్షణలుగా వుంటుండేవి. 2008 డిసెంబర్ నుంచి జగన్నాధ శర్మ గారు నవ్య సంపాదకత్వ భాద్యతలు స్వీకరించారు. ఆయన వచ్చిన దగ్గర నుంచి మరిన్ని ఆకర్షణలతో తీర్చిదిద్దారు. ముఖ్యంగా ప్రతి 20 సంవత్సరాలకు పాఠకుల తరం మారుతుందని, పత్రికలు చదివేతరం ఎక్కువ అవుతుందని, యువకులకంటే కూడా మధ్య వయసు వాళ్ళూ, ఆ పై వయసు వాళ్ళు పత్రికలు ఎక్కువగా చదువుతున్నారని గ్రహించి ఆ దిశగా మార్పులు చేస్తూ నవ్యలో మార్పులు సాగించారు జగన్నాధ శర్మగారు. రామాయణ, భారతాలను మళ్ళీ సరళమైన భాషలో మాములు నవలల్లాగా రాసి సీరియల్ గా ప్రచురించారు.

అలాగే, స్పాన్సర్ కథల పోటీలూ, వారానికి ఒక రచయిత సమగ్ర పరిచయం, ఇవన్నీ కూడా నవ్యకు ప్రత్యేక ఆకర్షణలుగా ఉండేవి. 2014 డిసెంబర్ 31 సంచికలో నా గురించి కూడా ఒక ప్రత్యేకమైన వ్యాసం ప్రచురించారు. ఇంకా, జగన్నాధ శర్మగారు మొదటి పేజీ పేరుతో రాసిన సంపాదకీయాలు కూడా ఆలోచింపజేసేవిగా, ప్రాక్టికల్ గా ఉపయోగపడే విధంగా ఉండేవి. 2004 ఉగాది సంచికలో ప్రారంభమైన నవ్య 16 సంవత్సరాలు పూర్తి చేసుకోని 2020 ఉగాది సంచికతో విశ్రాంతి తీసుకుంది. మళ్ళా ప్రారంభమవుతుందా, లేదా?అనే విషయం కాలమే నిర్ణయించాలి. ఇవండీ ఆంధ్రజ్యోతి దిన , వార పత్రికలలో రెండు దశల వివరాలు.

ఇంక మనం టైం లైన్ లో 1960-70 మధ్యలోనే వున్నాం. ఆ దశాబ్దంలో మొదలైన మరొక అద్భుతమైన మాస పత్రిక “యువ”. దీనికి స్థాపకులూ, సంపాదకులూ చక్రపాణిగారు. చక్రపాణి గురించి ఈ కార్యక్రమంలోనే చాలాసార్లు మాట్లాడుకున్నాం. ఆయన సంపాదకత్వంలో అనేక పత్రికల గురించి గతంలో తెలుసుకున్నాం. ఇక యువ మాస పత్రిక విషయానికి వస్తే, మొట్ట మొదటిసారిగా ఆ పేరుతో అంటే “యువ” అనే పేరుతో పత్రికను ప్రారంభించింది కొడవటిగంటి కుటుంబరావు గారు. అది కూడా 1935 లో తెనాలిలో. అయితే, ఆ పత్రిక 4,5 నెలలు మించి రాలేదు. ఆ రోజుల్లోనే యువ పబ్లికేషన్స్ అనే పేరుతో పుస్తక ప్రచురణ చెయ్యాలని ప్రయత్నించారు కొడవటిగంటి. అది కూడా పెద్దగా విజయవంతం కాలేదు. తరవాత ఆయన వివిధ ఉద్యోగాల్లోకి వెళ్లడం, చక్రపాణి గారు మద్రాస్ రావడం, ఇవన్నీ జరిగాయి. మళ్ళీ కొడవటిగంటిగారూ, చక్రపాణి గారు మద్రాస్ వచ్చినపుడు కలిశారు.

చక్రపాణిగారు అప్పటికే యువ పబ్లికేషన్స్ పేరుతో అప్పటికే చలంగారి పుస్తకాలూ, తన అనువాదాలూ పబ్లిష్ చేస్తున్నారు. అవి నాగిరెడ్డిగారి ప్రెస్ లో. 1945లో ఆంధ్ర జ్యోతి మాస పత్రికనూ, 1947 జూలై లో చందమామనూ,

ప్రారంభించాక, చక్రపాణి గారు "యువ" పేరుతో విద్యార్థుల మాస పత్రికను ప్రారంభిస్తున్నాను అని 1947 ఆగస్టు లో తన పత్రికలోనే ప్రకటన వేశారు. కేవలం విద్యార్థుల కోసమే అనుకున్న ఆ యువ మాస పత్రిక 1947 సెప్టెంబర్ లో మొదలయ్యింది. ఆ సంచిక కాపీలు నాకు లభ్యం కాలేదు. కేవలం యువకులూ, విద్యార్థులూ రాసినటువంటి కథలూ, కవితలే వేసారా? లేకపోతే మాములు సాహిత్య పరమైన అంశాలు కూడా ఉన్నాయా? అనేవి తెలీదు. ఒక సంచిక ముఖ చిత్రం మాత్రం దొరికింది. అయితే, విద్యార్థుల కోసమే అన్న ఈ యువ మాస పత్రిక ఎక్కువ సంవత్సరాలు కొనసాగిన దాఖలాలు లేవు. బహుశా 1950 రాకుండానే ఆగిపోయి ఉండాలి. ఇంత నేపథ్యం ఉందండి ఈ "యువ" అనే పేరుకి.

ఇప్పుడు మళ్ళీ 1960 కి వస్తే, చక్రపాణి గారు హైదరాబాద్ లో పబ్లిక్ గార్డెన్స్ ఎదురుగా వున్న ఒక పాత ఇంటిని కొని దాన్ని బాగు చేయించి దాంట్లో యువ కార్యాలయాన్ని స్థాపించారు. ఆ పేరు మీదనే యువ మాస పత్రికను తను సంపాదకుడిగా, వాళ్ళ అబ్బాయి సుధాకరరావు పబ్లిషర్ గా 1960 జనవరి సంచిక నుంచి ప్రారంభించారు. మొట్ట మొదటి సంచిక అయితే నాకు లభ్యం కాలేదు. 1960 మార్చి అంటే మూడవ సంచికను మీకు చూపిస్తున్నాను. బుజ్జాయి గారి కార్టూన్ ముఖ చిత్రంగా వచ్చింది. ఈ మూడవ సంచికలోనే బుజ్జాయి గారివే రెండు బొమ్మల కథలు వున్నాయి. అందులో ఒకటి రంగుల్లో కూడా వుంది. భానుమతి గారి "రోడ్డు రోలర్" అనే కథ వుంది.

చాలా కథలకూ, శీర్షికలకూ బుజ్జాయి గారే బొమ్మలు వేశారు. బుజ్జాయి గారు అంటే మీకు తెలిసే ఉంటుంది. దేవులపల్లి కృష్ణ శాస్త్రి గారి అబ్బాయి. ఆయన బొమ్మలే కాకుండా వడ్డాది పాపయ్య చిత్రం కూడా వుంది ఈ మూడవ సంచికలో. పనిలేని మంగలి అని ఒక శీర్షిక వుంది. అది ఆ తర్వాత చాలా సంవత్సరాలు కొనసాగింది. దీనికి రచయిత పేరు ఏమీ ఉండేది కాదు గానీ, చక్రపాణి గారే ఈ శీర్షికలో సమకాలీన రాజకీయాల గురించి ఘాటైన, వ్యంగ్యమైన విమర్శలు రాస్తూండేవారు. యువ మొదటి సంచిక నుంచే గోపీచంద్ గారి "చీకటి గదులు "అనే సీరియల్ మొదలయ్యింది. అలాగే మూడవ సంచికలో దాశరథి గారి పద్యాలూ, కార్టూన్ కి వ్యంగ్య వాక్య రచన పోటీ, అలాగే చిట్టచివరి పేజీలో మద్రాస్ లోని B.N K ప్రెస్ గురించి, చివరి పేజీలో చందమామ గురించిన ప్రకటనలు. ఇవన్నీ వున్నాయి.

చక్రపాణి గారు నిర్వహించిన ఆంధ్రజ్యోతి మాస పత్రిక ఛాయలు అసలే మాత్రం ఏవీ లేకుండా పూర్తి భిన్నంగా రూపొందించారు ఈ యువ మాసపత్రికను. ఇందులో కథలూ, సీరియల్స్, కార్టూన్స్ తో పాటుగా పాఠకుల్లో రాజకీయ అవగాహనను పెంచే అంశాలను కూడా చేర్చారు. మొట్టమొదట్లో బెంగాలీ నవలల అనువాదాల్ని పూర్తిగా ఒక సీరియల్ లాగా ప్రచురించేవారు. తరువాత సంక్షిప్తంగా ప్రచురించడం మొదలు పెట్టారు. అంటే మార్కెట్ లో వున్న బెంగాలీ అనువాదాల్ని సంక్షిప్తీకరించి యువలో ప్రచురించే వాళ్ళు.

ఎవరో అడిగారట "ఇదేమిటండీ చక్రపాణి గారు నవల మార్కెట్ లో వుంది కదా! మళ్ళా దాన్ని ఎబిడ్జి చేసి ప్రచురిస్తున్నారు?" అని. "లేదు చూస్తూ వుండండి!ఈ సంక్షిప్తమైన నవల చదివి, పెద్ద నవల చదవాలని చాలా మంది వెళతారు" అని. నిజంగా అలాగే జరిగింది. ఆయన ప్రచురించిన సంక్షిప్త నవలలు చదివి, మొత్తం నవల చదవాలి అనుకున్న వాళ్ళు చాలా మంది వున్నారు ఆ రోజుల్లో. ప్రారంభమైన కొద్ది సంవత్సరాలకే ప్రామాణికమైన పత్రికగా పేరు తెచ్చుకుంది యువ మాస పత్రిక. అంతే కాకుండా, రచయతలు, తమ రచన యువలో ప్రచురితమవడం అంటే చాలా ప్రతిష్టాత్మకంగా భావిస్తుండేవారు. యువకు ప్రత్యేక ఆకర్షణగా చెప్పుకోవాలంటే వడ్డాది పాపయ్యా గారి ముఖ చిత్రం. చివరి వర్ణ చిత్రాలు. అలాగే లోపలి పేజీల్లో పూర్తి పేజీ వర్ణ చిత్రాలు. ఆ రోజుల్లో వడ్డాది పాపయ్యా గారు కేవలం రెండు పత్రికలకు మాత్రమే బొమ్మలు వేస్తుండేవారట. ఒకటి చందమామ, రెండోది యువ. వర్ణ చిత్రాలు, పూర్తి చిత్రాలతో పాటుగా వడ్డాది పాపయ్యగారు వ్యంగ్య చిత్రాలు కూడా వేస్తుండేవారు. అలాగే యువలో ప్రారంభమైన కొన్ని ప్రఖ్యాత సీరియల్స్ గురించి చెప్పుకోవాలంటే, యద్దనపూడి సులోచనారాణి గారి "మీనా". కోడూరి కౌసల్యాదేవి "కళ్యాణ్ మందిర్" ఇలాంటి నవలలన్నీ యువలోనే సీరియల్స్ గా వచ్చాయి.

యువ మాస పత్రికను ఆ రోజుల్లో చదివేవాళ్ళకు వెంటనే గుర్తుకు వచ్చేది "దీపావళి ప్రత్యేక సంచిక". ఇదివరకు దీపావళి ప్రత్యేక సంచికల గురించి తెలుసుకున్నాం కదా! ఆ ప్రత్యేక సంచికలకు ఆది ఈ యువ దీపావళి ప్రత్యేక సంచిక. 1961 దీపావళి నుంచి దాదాపు 250, 300 పేజీలతో పెద్ద సైజులో దీపావళి ప్రత్యేక సంచికను ముద్రించడం చక్రపాణి గారే ప్రారంభించారు. దీపావళి ప్రత్యేక సంచిక కోసం రచయితల నుంచి ప్రత్యేకంగా అడిగి మరీ రచనలు తెప్పించుకునేవారట. భానుమతి గారి అత్తగారి కథలు కూడా యువ లోనే వస్తుండేవి. మొట్ట మొదటి దీపావళి సంచిక విషయసూచిక నా దగ్గర వున్నది.

అందులో... యువ దీపావళి సంచికలకు మరింత క్రేజ్ తెచ్చిపెట్టినవి వడ్డాది పాపయ్యా గారి వర్ణ చిత్రాలు. కేవలం కవర్ పేజీ, చివరి పేజీలే కాకుండా లోపల పేజీల్లో కూడా మల్టీ కలర్, నాణ్యమైన ముద్రణతో లోపల ఫుల్ పేజీలో వేస్తుండేవారు. ఆ రోజుల్లో ఆ వర్ణ చిత్రాలను ఫ్రేమ్ కట్టించుకొని ఇళ్ళల్లో పెట్టుకునేవారు. 3 వేలు సర్క్యులేషన్ తో ప్రారంభమైన యువ మాస పత్రిక 1975 కి 25 వేలకి చేరింది. 1975 సెప్టెంబర్ లో చక్రపాణి గారు మరణించారు. 1975 నవంబర్ సంచిక యువలో చక్రపాణి గురించి, ఆయనతో సన్నిహితంగా పనిచేసిన అనేక మంది రాసిన వ్యాసాలు వున్నాయి. మొదటిపేజీ సంపాదకీయం లోనే రాశారు. ఒక వైపు ఆయన బొమ్మ వేశారు. మరో ప్రక్క "శ్రద్ధాంజలి" అని రాసి, దిగువ ఇలా రాసారు.

"1975 సెప్టెంబర్ 24 న భౌతిక కాయాన్ని విడిచారు. కానీ, వారి ఆప్తులకూ, వారు ఆప్తులైన వారికీ చక్రపాణి చిరంజీవి. అంతేకాదు తెలుగు భాషలో ప్రారంభించి, 11 భాషల్లో వెలువడుతున్న చందమామ పాఠకులకూ, 25

సంవత్సరాలుగా విజయా ప్రొడక్షన్స్ సినిమాలు చూస్తున్న ప్రేక్షకులకూ, 17 ఏళ్లుగా యువ పాఠకులకూ, అంటే యావదాంధ్ర దేశానికే కాక భారతదేశం లోని అన్ని రాష్ట్రలలోని చందమామ పాఠకులకూ, చక్రపాణి గారి పేరు మరవరానిది. “

అని ఆయన జీవిత విశేషాలు క్లుప్తంగా రాసారు. అలాగే చక్రపాణి గారితో తమకి వున్న అనుబంధం గురించి, కొడవటిగంటి, ధనికొండ హనుమంతరావు గారూ కూడా ప్రత్యేకమైన వ్యాసాలు రాసారు. అప్పటికి యువ సంపాదక వర్గంలో వున్న తాళ్లూరి నాగేశ్వరావు గారు కూడా చక్రపాణి గురించి ఒక ప్రత్యేకమైన వ్యాసం రాసారు. చాలా యాదృచ్ఛికంగా 1975 సెప్టెంబర్ లో చక్రపాణి గారు మరణించే సమయానికి యువలో ఒక సీరియల్ వస్తోంది. దాని పేరు “చక్రపాణి”. అది రాసింది కావిలిపాటి విజయలక్ష్మి గారు. అలాగే 1975 నవంబర్ యువ సంచికలోనే అంటే చక్రపాణి గారు మరణించాక “శ్రీ రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్” అనే సినిమాను పాలగుమ్మి పద్మనాభరాజుగారు నవల రూపంలో రాసారు. చక్రపాణిగారు మరణించే సమయానికి “రాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్” సినిమా నిర్మాణం మధ్యలో వున్నదన్నమాట. దాని కథను కూడా యువలో సీరియల్ గా ప్రచురించారు. ఆయన మరణించాక.

చక్రపాణి గారు లేని యువ మాస పత్రికను వాళ్ళ అబ్బాయి మరొక 10 ఏళ్ళ పాటు కొనసాగించారు. 1980 దశాబ్దం చివరలో అంటే, 1985, 86 ప్రాంతాల్లో ఆగిపోయింది. చక్రపాణి గారి మానస పుత్రిక– యువ మాస పత్రిక అన్ని దశాబ్దాలు కొనసాగింది. ఇప్పటికి కూడా వెనక్కి తిరిగి తెలుగు పత్రికలకు స్వర్ణ యుగం అనదగిన 1960,70,80 దశకాల్ని సమీక్షించుకుంటే, విలక్షణంగా, సమున్నతంగా నిలుస్తుంది యువ మాస పత్రిక. ఇవీ యువ మాస పత్రిక విశేషాలు.

ఈ పత్రికల సమాచార సేకరణలో నాకు సహకరించిన వాళ్ళు కె. రామచంద్ర మూర్తి గారూ, జగన్నాథ శర్మ గారూ, అలాగే నార్ల వెంకటేశ్వరావు గారి దగ్గర పనిచేసిన సీనియర్ మోస్ట్ ఇన్నయ్య గారూ. వారి విలువైన సమయాన్ని నా కోసం కేటాయించి, ఫోన్ లో అన్నిటికీ చాలా ఓపిగ్గా సమాధానాలు చెప్పి, ఈ కార్యక్రమం సాధికారంగా రూపొందడానికి ఎంత గానో సహకరించారు. అందరికీ మరొక సారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మరిన్ని విశేషాలు తరవాత భాగం లో ...

అక్షరీకరణ – వి. వెంకటరావు

2020 సెప్టెంబర్ 30 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS